# లాటరీ తాత

వీరన్న ఎక్కడివాడో ఆ ఊరు ఎప్పుడు, ఎలా వచ్చి స్థిరపడ్డాడో మొదలైన వివరాలు ఎవరికీ అంతగా తెలియవు. నిజానికి వీరన్నని పేరుతోకన్న లాటరీ తాత అంటే చాలా మందికి తెలుస్తుంది. అతడు నడిపే లాటరీ వేలు, లక్షలు రూపాయలు వెదజల్లే పెద్దల లాటరీ కాదు. పదులు, పాతికలు, పిప్పరమెంట్లు పంచియిచ్చే పిన్నల లాటరీ.

అయితే వీరన్నకి ఈ లాటరీ వ్యాపారం ఒక్కటే కాక మరికొంత సైడ్ బిజినెస్ కూడా ఉండేది. వేయించిన వేరుశెనగ కాయలు, బటానీలు, కొబ్బరి ఉండలు వగైరా వస్తువుల అమ్మకం. ఇది లాటరీలో చేస్తున్న మోసం బయటపడకుండా కప్పుకోడం కోసమే! అతడి ఆదాయంలో చాలా భాగం బిళ్లల లాటరీలో వచ్చేదే!

వీరన్న ఆర్జనకి పెద్దలతోను, వారి ఆర్థిక బాధలతోను సంబంధం లేదు. కరువు కాటకాలతో మనుషులు మాడిపోతున్నా వీరన్న వ్యాపారానికి ఢోకా లేదు. కారణం అతడి ఖాతాదారులు డబ్బు వత్తిళ్లు చవిచూడని చిన్నపిల్లలు. అతడి వ్యాపార సమయాలు బడి విడిచే వేళలు. ఏ రోజున ఏ బడి దగ్గర బండి నిలుపుకుంటే బేరం బాగా పలుకుతుందో వీరన్నకి బాగా తెలుసు. ఎటువంటి పిల్లల చేతుల్లో డబ్బులు ఆడుతాయో అతన్ని నిద్రలో లేపి అడిగినా చెప్పేయగలడు.

వీరన్న బండి మీద అమర్చిన లాటరీ చక్రం పిల్లల పాలిట సాలెగూడు వంటిది. ఒకసారి దానిలో చిక్కుకొంటే మరి కదలబుద్ధి కాదు. అక్కడ నుంచి ప్రయత్నించి బైటపడాలనుకొన్నా వారిని పట్టి ఉంచుతుంది అదృష్టం మీది నమ్మకం.

అలవాటుగా ఆ రోజు సాయంకాలం అయిదు గంటల వేళకి ఆడపిల్లల బడి దగ్గర బండి ఆపుకొన్నాడు వీరన్న. అప్పటికింకా విడుపు గంట కొట్టలేదు. బడి ముందు ఆటస్థలం అంతా ఖాళీగా, కట్నకానుకలు అందలేదని కోపంతో పెళ్లివారు విడిచిపోయిన పెళ్లి పందిరిలా ఉంది. వెనుక గదుల్లోంచి క్లాసులు ఇంకా జరుగు తున్నాయి అనేందుకు నిదర్శనంగా పిల్లల కేకలు, టీచర్ల అదలింపులు వినవస్తున్నాయి.

"ఇంకా ఏలయినట్టులేదు" వీరన్న తనలో తనే అనుకొంటూ, కఱ్ఱ చెక్కల బండి గోడవారగా నిలిపి తలగుడ్డలోంచి చుట్ట తీసి వెలిగించాడు.

ఆ చుట్ట సగం కాలేసరికి బడి విడుపు గంట వినపడింది. ఆర్పిన చుట్టని తల గుడ్డలో దాచి, బండిని మరికాస్త ముందుకు లాగి గేటు ప్రక్కగా నిలబెట్టాడు వీరన్న. దూరంగా ఉన్న గదుల్లోంచి, మూడో తరగతి రైలు ప్రయాణీకుల్లా ఒకర్నొకరు తోసుకొంటూ, కుమ్ముకొంటూ బైటికి వస్తున్నారు పిల్లలు. చిట్టి అడుగులవాళ్లు, పొట్టి ఫ్రాకులవాళ్లు, పావడా జుబ్బాల వాళ్లు, పరికిణీ వోణీలవాళ్లు.... వాళ్లలో తన ఖాతాదారులు ఎవరో

వీరన్నకి బాగా తెలుసు. నీటుగా గోటుగా బట్టలు వేసుకొని, నేలకి కాలానకుండా నడిచివచ్చే హైక్లాస్ అమ్మాయిలు వీరన్న బండివైపు కన్నెత్తి చూడరు. ఒకవేళ ప్రమాదవశాత్తు అటు దృష్టి పడినా, పురుగుని చూసినట్లు అతన్ని, అతడి బండిమీది సరుకుని చూసి, దేశంలో రోగాలు వ్యాపించడానికి ఇటువంటి వాళ్లే కారణం అన్నట్లు జుగుప్సతో ముఖం తిప్పేసుకొంటారు. మరీ చిట్టి పొట్టి పాపలకి వీరన్న బండిలో తినుబండారాలకన్న, ఇంటిలో ఉన్న అమ్మ ఒడి ఎక్కువగా ఆకర్షిస్తుంది. బడి విడిచిందే తడవుగా ఎంత త్వరగా వెళ్లి అమ్మ చేతుల్లో వాలుతామో అన్నట్లు పరుగు పెడతారు. ఇంక మిగిలినవాళ్లు, ఆరేడేళ్ల అమ్మాయిలు.... అమ్మని బెల్లించో, నాన్నని కవ్వించో అయిదు, పది పైసలు రోజూ కళ్లజూచే అలవాటు ఉన్న వాళ్లు. వీళ్లే వీరన్న ఖాతాదారులు. అతడికి రెండు పూటల కడుపుకింత తిండి, రాత్రి పూట నోటిలో ఓ చుక్క పడేందుకు అవకాశం కల్పించేవాళ్లు.

ఆ బడిలో, తన బండి ముందు ఆగి అయిదో, పదో పైసలు ఏరోజు కారోజు చెల్లబెట్టుకు వెళ్లే పిల్లలందరూ వీరన్నకి బాగా తెలుసు. ఆ గుంపు గేటు వైపు రావడం చూసి, వ్యాపార సరళిలో "గరమా గరమ్ చెనక్కాయలు, తీయాతీయని కొబ్బరి ఉండలు, కరకర కటకట బటానిగింజలు" అంటూ పాట అందుకున్నాడు.

ప్రతిరోజులాగే ఆ రోజుకూడా సెనక్కాయలు, కొబ్బరి ఉండలుకన్న లాటరీ పిప్పరమెంట్లకే గిరాకీ ఎక్కువగా ఉంది. ఎందరో పిల్లలు తమ చేతిలో ఉన్న అయిదో, పదో పైసలు వీరన్న ముందు పెట్టి, ఆ డబ్బులికి ఏభయ్యో, అరవయ్యో బిళ్లలు వస్తాయని గిరగిర తిరుగుతున్న లాటరీ చక్రం వైపు, అందుమీద ఉన్న అంకెల వైపు, తమ అదృష్టాన్ని సూచించే పొడుగాటి ముల్లు వేపు ఆశతో చూస్తున్నారు. ఆ ముల్లు గిరగిర, గిరగిర రెండు చుట్లు తిరిగి, ఇంక తిరగనని మొండికేసి ఏ అయిదు దగ్గరో, పది దగ్గరో ఆగిపోయేసరికి ఏడుపు ముఖాలు పెట్టుకొని, చేతిలో పడ్డ బిళ్లల్ని లెక్కపెట్టుకొంటూ దిగులుగా వెళ్లిపోతున్నారు. అలాకాక ఆ బండి దగ్గర కూడబడ్డ అందరిలో ఏ ఒకరికో, ఇద్దరికో ఎక్కువ బిళ్లలు రావడం, వారు వాటిని మిగిలిన పిల్లలకి చూపించుకొంటూ గర్వపడ్డం, రేపు నాకూ వస్తాయి అని ప్రతి పిల్ల ఆనాటి ఓటమిని సర్దుకు పోవడం రోజూ మామూలుగా జరిగే విషయమే. ఆ ఆశతోనే ఈ రోజు ఓడినా, రేపు గెలుపు తమదే అనే నమ్మకంతో ఉత్సాహంగా పిల్లలు ముందుకి వస్తారు.

పిల్లలంతా వెళ్లిపోయాక, వీరన్న చిల్లర లెక్కపెట్టుకొని జేబులో వేసుకొంటుంటే వచ్చింది ఒక చిన్నపిల్ల.

"ఏటి కావాల సిట్టెమ్మా" అన్నాడు వీరన్న పని చూసుకొంటూనే.

"నాపేరు సిట్టెమ్మ కాదు. పాప" అంది ఆ పిల్ల వీరన్న మాటని సరిదిద్దుతూ.

పాప వయసు ఏడేళ్లకి పైబడి ఉండదు.... చామనఛాయ.... కోల ముఖం... ఛాయ తక్కువైనా పాప ముఖం కళగా ఉంది. ఆ ముఖానికి అంత అందం తెచ్చినవి నీటిలో

కదిలే చేపపిల్లల్లా తళతళ మెరిసే ఆ పెద్ద కళ్లు. వాటిమధ్య నిటారుగా నిలిచి వీరన్న వంక సూటిగా చూస్తున్న సూది ముక్కు. ఆ పిల్ల తొడుక్కున్న బట్టలు చూస్తే సిరిగల ఇంట పుట్టిన బిడ్డ కాదని తెలుస్తున్నది. ఆ అమ్మాయి ఏనాడూ తన దగ్గర ఏదీ కొన్న గుర్తులేదు వీరన్నకి. కాని ఆ పిల్ల ముఖం మరీ అపరిచితమైందిగా కూడా లేదు. ఎప్పుడో ఎక్కడో చాలాసార్లు చూసినట్లే అనిపించింది.

"ఏదో వోటిలే... పేరుకేటి... ఏటి కావాలో సెప్పు" అన్నాడు వీరన్న సరి చూసుకొన్న డబ్బుల్ని జేబులో పోసుకొంటూ.

"నాకేం వద్దు... నా దగ్గర డబ్బులు లేవు" ఆ కాస్త మాటా అని, గిర్రున వెనుతిరిగి వెళ్లిపోయింది ఆ పిల్ల.

మళ్లా మరుసటి రోజు అదేవేళకి పిల్లలంతా వెళ్లిపోయాక వచ్చింది పాప. పిల్లలంతా రోజూ అలా కొనుక్కొని తింటుంటే నోరూరిందేమో! వీరన్నకి ఆ పిల్లని చూస్తే జాలివేసింది. 'నాలుగు బిళ్లలో... చెనగ్గింజలో సేతిలో పెట్టి పంపుతే తీరిపోయె' అనుకొన్నాడు.

వీరన్న ఇవ్వజూపిన బటానీలకి పాప చెయ్యి జాపలేదు.

"ఊరికే తీసుకుంటే అమ్మ కోప్పడుతుంది" అంది.

"పోనీలే... డబ్బులెప్పుడుంటే అప్పుడు ఇద్దువుగాని... తీసుకో" అన్నాడు వీరన్న.

"అత్త బావకైతే బిళ్లలు కొనుక్కోడానికి డబ్బులు ఇస్తుంది.... నా కియ్యదు."

"అత్తమ్మియ్యకపోతే మీ అయ్యనడుగు..."

"నాన్నకి ఉద్యోగం లేదుగా... డబ్బులెలా వస్తాయి?" అంతవరకు ఉత్సాహంగా ఉన్న పాప ముఖ ఆ మాట అంటుంటే చిన్నబోయింది. ఈసారి పాపంటే కేవలం జాలే కాక ఇష్టం కూడా ఏర్పడింది వీరన్నకి.

"ఇంద.... ఇక్కడే తినిపో... అమ్మతో సెప్పకు.... నే డబ్బులడగన్లే" అన్నాడు రెండు కొబ్బరి ఉండలు కూడా తీసి చేతిలో పెడ్తూ.

"ఊహూ... నాకేం వద్దు" పాప చేయి వెనక్కి లాక్కొంది.

"ఏటీ వద్దకపోతే, నా బండికాడకెందుకొత్తున్నావు?" విసుగుతో ప్రశ్నించాడు వీరన్న.

వీరన్న మాటకి పాప జవాబు చెప్పలేదు. అలాగని అక్కడి నుంచి వెళ్లిపోనూ లేదు... బండిని, అతడిని, బండి మీద ఒక పక్కగా అమర్చిన లాటరీ చక్రాన్ని మార్చి మార్చి చూస్తుంది.

"ఏటిచ్చినా ఏటీ వద్దంటావు... మరేటి అట్టా సూత్తూ ఉండిపోనావు? సీకటి పడ్తున్నాది. ఇంటికిపో... మీయమ్మ సూత్తుంటాది" అన్నాడు వీరన్న బండిని అక్కడ నుంచి నడుపుకుపోయే ప్రయత్నంలో కాలుని సరిచేసుకొంటూ.

అప్పుడే చూసింది పాప అతడి కర్ర కాలు వైపు.

"నీ కాలికేమయింది?" అంది కుతూహలంగా.

"ఇరిగిపోనాది."

"ఎందుకు విరిగిపోయిందో నాకు తెలుసు" మాటని ఒత్తి పలుకుతూ అంది పాప.

"ఎందుకేటి... సెప్పు సూద్దాం" తమాషాకి అడిగాడు వీరన్న.

"నువ్వు అందర్నీ మోసం చేస్తున్నావు. అందుకే నీ కాలు దేవుడు విరిచేసాడు" ఈ మాటకి తిరుగులేదు అన్నంత ధీమాగా అంది పాప.

నడుపుతున్న బండిని ఆపి, ఆ పిల్లవంక వింతగా చూసాడు వీరన్న. ఆ చిన్నపిల్ల ఎంత పెద్దదానిలా మోసం, దేవుడు అనీ అలా మాట్లాడుతుంటే సరదాగా ఆ పిల్లతో మరి కాస్తసేపు మాటలు పెంచాలనిపించింది అతడికి.

"ఏటి సిట్టెమ్మా మోసం అంటున్నావు. నేనేర్ని మోసం సేత్తున్నాను? కూంత సెప్పుమీ ఇనుకొంటా" అన్నాడు.

"నాపేరు సిట్టెమ్మ కాదు."

"అది సర్లే... పాప అనే పిలుత్త కాని... ముందు ఈ మాట సెప్పు నేనేర్ని మోసం చేసేను?"

"నువ్వు రోజూ మా బడిపిల్లల్ని మోసం చేస్తున్నావు... అందుకే..."

"ఏటి మీ బడిపిల్లల్ని నేను మోసం సేత్తన్నానా.... అదెట్లాగబ్బా!" ఆశ్చర్యం నటిస్తూ అన్నాడు వీరన్న.

"అవును... నిజంగా నువ్వు మోసం చేస్తున్నావు. అబద్ధాలు చెప్తున్నావు. అందుకే దేవుడికి కోపం వచ్చి నీ కాలు విరిచేసాడు" ఆవేశంగా అంది పాప.

"అబద్ధాలు నేనేటి సెప్తున్న....?"

"లాటరీకి అయిదు పైసలు పెడితే ఇన్ని బిళ్లలు వస్తాయని చెప్పి... అది అబద్ధం కాదూ?"

"అది అబద్ధం ఎట్టగయింది సిట్టెమ్మా... ముల్లు ఎక్కడ ఆగిపోతే అన్ని బిళ్లలు ఇత్తున్నా... ఇందులో అబద్ధం, మోసం ఏటుంది?"

"చక్రం ఆగిపోవడం లేదు. నువ్వే బండి కింద ఉన్న తీగెని కాలితో నొక్కి ఆపేస్తున్నావు. నేను రోజూ అక్కడ నిలబడి చూస్తున్నాను...."

ఆ మాట విని గతుక్కుమన్నాడు వీరన్న. కొంపతీసి ఈ పిల్ల పోయి ఈ మాట మిగిలిన పిల్లకాయలందరితో చెప్పలేదు కదా, అని కంగారుపడ్డాడు. వాళ్లకి తెలిసిందంటే బేరాలు పోతాయి. బడిలో టీచర్లకి చెప్తే అసలికే మోసం. పోలీసులకి పట్టిస్తారు.

"ఈమాట ఇంకేరితో సెప్పినావేటి!" ఆత్రంగా ప్రశ్నించాడు.

"లేదు" అన్నట్టు తల ఊపింది పాప. తల మీంచి తట్టెడు బరువు దింపుకొన్నట్లు నిట్టూర్చాడు వీరన్న.

"చెప్తే నీ దగ్గరికి పిల్లలెవరూ రారుగా, మరి నీకు బువ్వెలా వస్తుంది?" పాప ఎదురు ప్రశ్న వేసింది.

వీరన్న కళ్లలో చాలాకాలం తరువాత నీళ్లు తిరిగాయి. అవి తనపట్ల జాలితోకాదు. ఆ చిన్నపిల్ల చూపుతున్న ఆపేక్షకి అతడి మనసులో ఏవో జ్ఞాపకాలు కదులాడి, ఆ తలపులు చిందించిన కన్నీటి కణాలు అవి.

చిన్ననాటి నుంచి ఆపేక్షకి, ఆత్మీయతకి నోచుకోని నిర్భాగ్య జీవితం వీరన్నది. ఒళ్లు తెలియకుండా తాగి తందనాలాడే తండ్రీ, తిండి పెట్టక మాడబెట్టే సవితి తల్లీ.... అలా గడిచిపోయింది వీరన్న బాల్యం. వయసు వచ్చాక ఇల్లరికపు అల్లుడుగా అత్తవారింటా అంతకు మించిన ఆదరం అతడికి లభించలేదు. "సేతనైతే డబ్బు గడించి పెళ్లాన్ని, బిడ్డని ఎంటెట్టుకు పడుండు" అనేవారు బావమరుదులు.

అభిమానంతో అత్తవారి ఇల్లు విడిచి వచ్చాడు. ఏదో విధాన పెళ్లాం, బిడ్డలకి తిండి పెట్టేపాటి సొమ్ము గడించలేక పోతానా అనే నమ్మకంతో అమాయకపు వీరన్న, ధనార్జన కోసం వెతుకులాడే అటువంటి అమాయకులంతా చిక్కుకొనే ఉచ్చుల్లోనే తానూ చిక్కుకొన్నాడు. ఫలితం రెండేళ్ల జైలు, కుంటి కాలు, రొంటిని రెండొందల రూపాయలు. కుంటి కాలు ఈడ్చుకొంటూ వీరన్న ఇల్లు చేరేసరికి కూతురు సిట్టి కలరా వచ్చి చచ్చిపోయింది. పెళ్లాం ఎవరితోనో లేచిపోయింది.

ఏనాడూ తనంటే మనసులేని పెళ్లాం కోసం వీరన్న బాధపడలేదు. తన ప్రాణానికి ప్రాణమైన సిట్టికోసం కంటికి కడివెడుగా ఏడ్చాడు. "నేనింకేర్ని సూసుకు బతికేదే సిట్టీ" అని తల కొట్టుకొని ఏడ్చాడు. "అది నీ కూతురైతే నిన్నిట్టా ఉసురుపెట్టి పోనేపోదు. ఆ ముండ దాన్ని ఏడికి కన్నాదో... పల్లకపోయి ఇంకొత్తిని కట్టుకొని సుఖపడు. ఎదవలు ఉండి నిన్నేటి సుఖపెట్టినారు" అంటూ ఓదార్చారు బంధువులు.

వీరన్నకి పెళ్లాం, పిల్ల... ఆ ముచ్చట బ్రతుకులో మూడు పదులు నిండకుండానే తీరిపోయింది. మళ్లా ఆ రొంపిలో దిగకూడదనుకొన్నాడు. చేతిలో మిగిలిన సొమ్ముతో, ఆ బతుక్కి దూరంగా నడిచివచ్చి ఈ వ్యాపారం పెట్టుకొన్నాడు. ఆనాటి నుంచి వీరన్నకి ఆ బండి, వ్యాపారం మినహా యిస్తే నా అనుకొన్నది ఇంకొకటి లేదు. రెండు పూట్ల తిండి, రాత్రికో చుక్క... ఇంకో విషయమే అతడి మనసులో చోటు చేసుకోలేదు.

అంత కాలం తరువాత అతడి మనసులో తన మాటలతో మమతల పొరలు కదిలించింది పాప.

"నీకియన్నీ ఏరు సెప్పేరు సిట్టెమ్మా?" కళ్లల్లో తిరిగిన నీళ్లు తుడుచుకొంటూ అడిగేడు వీరన్న.

"నాపేరు సిట్టెమ్మ కాదని ఎన్నిసార్లు చెప్పినా మళ్లీ అలాగే పిలుస్తావేం?" పాప ప్రశ్నించింది.

"నాకు నీనాగే ఓ కూతురుండేది... దానిపేరు సిట్టి.. అందుకని..."

"ఇప్పుడెక్కడుంది?" ఉత్సాహంగా ప్రశ్నించింది పాప.

"సచ్చిపోనాది" వీరన్న మరోసారి కళ్లు తుడుచుకొన్నాడు.

"అయ్యో పాపం" అనుకొంది పాప మనసులోనే. పాపకి తాతని చూస్తే జాలేసింది. "పోనీ అలాగే పిలువు తాతా.... నే పలుకుతాలే" అంది ఊరడింపుగా.

మరునాటి నుండి వేసవి సెలవులు. వీరన్నకి పాపని కలుసుకోడం పడలేదు. సెలవలు పూర్తి అయి పాప తిరిగి బడికి వచ్చిననాడు చాలా కాలం తరువాత ఎవరో ఆత్మబంధువుని చూచినంత సంతోషం కలిగింది వీరన్నకి.

"తాతా! నేను పరీక్ష పాసయేను" ఎంత ఉత్సాహంగా వచ్చి చెప్పింది పాప! పాప రెండు చేతుల్లో రెండు కొబ్బరి ఉండలు పెట్టాడు వీరన్న. ఈసారి వీరన్న ఇచ్చిన ఉండలు పుచ్చుకోడానికి పాప సంకోచించలేదు. తాత ఇచ్చాడని చెప్తే అమ్మ కోప్పడదు, అనుకొంది. అతనికి తనకి మధ్య ఇచ్చి పుచ్చుకొనే అనుబంధం ఏదో ఏర్పడినట్లు అనిపించింది పాపకి.

కొబ్బరి ఉండలు తింటూ పరాగ్గా వీరన్న బండివైపు చూసింది పాప. లాటరీ చక్రం ఉండే చోటులో మరమరాల జంగిడి ఉంది.

"నీ చక్రం ఏదీ?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"ఇరిగిపోనాది" పాప ముఖం వంక చూస్తూ వీరన్న జవాబు చెప్పాడు. పాప మాట్లాడలేదు. ఆ పిల్ల కళ్లలో కదులాడిన తృప్తిని చూసాడు వీరన్న.

వీరన్న బండిమీద తొలగిపోయిన లాటరీ చక్రం తిరిగి అక్కడికి చేరుకోలేదు. వీరన్న మనసులో చోటుచేసుకున్న పాప అక్కడి నుంచి కదలిపోలేదు.

పాపతో స్నేహం కలిసాక వీరన్నకి వ్యాపారం మీద దృష్టి తగ్గిపోయింది. ఓపూట తిండికి ఇంత మిగిలితే చాలు అన్నట్లు, మిగిలిన సమయం అంతా పాప కోసం ఎదురు చూడ్డం, పాపతో కబుర్లు చెప్పడంతో గడిపేసేవాడు. పాప వీరన్నకి ఎన్నో కబుర్లు చెప్పేది. తన గురించి, తల్లి గురించి, తండ్రి గురించి... అత్త పక్షపాత బుద్ధి గురించి, బావ కల్పించి చెప్పే అబద్ధాల గురించి. "ఓసారేమయిందనుకొన్నావు తాతా...." ఇలా మొదలయేవి పాప కబుర్లు. "ఏ మయింది సిట్టెమ్మా?" వెంటనే ఎంతో కుతూహలం చూపిస్తూ ప్రశ్నించేవాడు వీరన్న.

అటువంటి సందర్భంలోనే ఓసారి చెప్పింది పాప. అత్త తన పుట్టినరోజుకి కొత్త గౌను కొనలేదని, బావకైతే ఎన్నో బట్టలు కొంటుందనీ, ఏమైనా అడిగితే మీ నాన్నని డబ్బులడిగి కొనుక్కో అంటుందనీ.... "నువ్వే చెప్పు తాతా.... నాన్నకి ఉద్యోగం లేదు కదా... మరి డబ్బులెలా వస్తాయి" అంటూ ప్రశ్నించింది. అత్త పక్షపాతబుద్ధికి శిక్షగా, ఉదయం కాఫీ కోసం అత్త దాచుకొన్న పాలని ఆరాత్రి దేవుడు పిల్లిచేత తాగించేయడం కూడా చెప్పకుండా ఉండలేదు పాప.

"నీ పుట్టినరోజు ఎప్పుడొత్తాది చిట్టెమ్మా?" అని అడిగాడు వీరన్న.

"కృష్ణుడు పుట్టేడే... ఆరోజే నేనూ పుట్టేను"

"కృష్ణుడెప్పుడు పుట్టినాడు బాబుగారూ?" దారిన కన్పించిన పురోహితుడినల్లా అడిగి తెలుసుకొన్నాడు వీరన్న.

శ్రావణమాసం మొదలయింది. రా చినుకు, పో చినుకు.... రెండు రోజులైంది. 'ఎండనే మాట లేదు. బండి మీద గుడ్డ కప్పి, తల మీ౯ గొడుగు వేసుకొని బడి గేటు ముందు నిలబడి, విడుపు గంట కోసం ఎదురు చూస్తున్నాడు వీరన్న. అంతకి రెండు రోజులై పాప బడికి రాలేదు. వీరన్నకి మనసు మనసులో లేదు. "ఏటయింది, సిట్టెమ్మకి ఏటయింది? ఊరుకి, పల్లెకి పోతే సెప్పకుండా పోదే? జప్పడిపోనాదా.... ఎప్పుడూ బడికి రాడం మాన్లేదే... ఏటయి ఉంటది?.... ఈ ఏలైనా వచ్చినాదో... నేదో...." కంగారు పడ్తున్నాడు వీరన్న.

బడి విడుపు గంట కొట్టి పిల్లలంతా వెళ్లిపోయినారు అని నిర్ధారించుకొన్నాక, చివరిగా వస్తున్న ఆయాని నిలిపి, పాప గురించి అడిగాడు.

"ఏ పాప?" అంది ఆయా.

పాప రూపురేఖలు చదువుతున్న క్లాసు చెప్పాడు వీరన్న.

"ఆరిల్లు ఎక్కడుంటదో నాకు సరిగా తెలియదు. కాని రోజూ చంద్రమ్మతో కలిసి వస్తుంటది. చంద్రమ్మ ఇల్లు ఆ కోనేటి పక్క వీధిలో ఉంది. పోయి చూడు" అంది ఆయా.

మరునాడు ఉదయాన్నే బయలుదేరి ఆ కోనేటికి అటు ఇటు వున్న వీధులన్నీ గాలించాడు వీరన్న. పాప ఎక్కడా కన్పించలేదు. పాప గురించి ఎవరిని ఎలా అడిగి తెలుసుకోవడమో అతడికి తోచలేదు. వీరన్నకి పాప అమ్మ, నాన్నల పేర్లు తెలియవు. ఇంటి పేరు అసలే తెలియదు. అంతలో వీరన్నకి ఒక మంచి ఆలోచన వచ్చింది. పాపని చూసినంత సంతోషం కలిగింది.

బండిని ఈడ్చుకొంటూ గంట వాయిస్తూ "గరమా గరమ చెనక్కాయలు...." అంటూ అమ్మకం మొదలుపెట్టాడు. పాప ఏ ఇంట్లో ఉన్నా తన గంట విని బైటికి వస్తుంది. ఏ స్థితిలో ఉన్నా తన గొంతుక పోల్చుకొంటుంది

ఆశతో ఆ వీధులన్నీ తిరిగాడు వీరన్న. ఓ యింటి అరుగు మీంచి ఓ పిల్ల "తాతా" అని పిల్చింది. ఆ పిలుపు పాప పిలుపు లాగే విన్పించింది వీరన్నకి. ఆత్రంగా సొట్టకాలు ఎత్తుకొంటూ అటు నడక సాగించాడు.

ఆపిల్ల 'పాప' కాదు. పది పైసలకి శెనక్కాయలు, నాలుగు కొబ్బరి ఉండలు కొనుక్కొని ఇంట్లోకి వెళ్లిపోయింది. సాయంకాలం దాకా తిరిగిన వీధులే మళ్లా మళ్లా తిరిగాడు వీరన్న. అతడి ఒంట్లో శక్తి, మనస్సులో పాపని చూడగలననే నమ్మకం రెండూ సడలిపోయాయి. నెమ్మదిగా కాళ్లీడ్చుకొంటూ బడి గేటు ముందుకి చేరుకొన్నాడు.

ఎప్పటిలా బడి విడుపు గంట కొట్టారు. పిల్లలు ఒకర్ని ఒకరు తోసుకొంటూ కుమ్ముకొంటూ బైటికి వస్తున్నారు. అంతమంది పిల్లల్లో పాప కోసం వీరన్న కళ్లు వెర్రిగా వెతుకులాడాయి. యాంత్రికంగా అతడి చేతులు పనిచేస్తున్నాయి. నోరు "గరమా గరమ్ చెనక్కాయలు...." అంటూ పాట పాడుతున్నది. మనసు మాత్రం ఆ పిల్లల మధ్య పాప లేదు అన్న విషయం కెలుకుతూనే ఉంది.

మూడు రోజులై పాప కోసం చూసి చూసి అతడి కళ్లు అలసిపోయాయి. అనుభవించిన ఒంటరితనంతో అతడి మనస్సు మొద్దుపాలిపోయింది.

"ఇంకోపాలి నన్ను మోసంచేసి పోనావా సిట్టెమ్మా" అని బాధపడ్డాడు.

నిరాశతో వీరన్న వెనుతిరిగి వెళ్లిపోతుంటే దూరం నుంచి విన్పించింది పాప పిలుపు "తాతా" అంటూ.

"సిట్టెమ్మా" అంటూ కర్రకాలితోనే పరుగు పెట్టబోయి పడిపోయాడు వీరన్న. పాప ఆత్రంగా వచ్చి తాతకి చెయ్యి అందించింది. ఆ చిన్నారి చేతుల ఆసరాతో వీరన్న లేచి తన కాళ్ల మీద తిరిగి నిలబడ్డాడు.

అప్పుడే తోటలో పూచిన పువ్వంత అందంగా ఉంది పాప. ఆ పూరేకుల మీద వేకువ జామున పడ్డ మంచు బిందువంత నిర్మలంగా ఉంది ఆ పిల్ల ముఖం.

"సిట్టెమ్మకేటీ కానేదు.... నా సిట్టెమ్మ సల్లగ ఉంది. ఊరకె గాబర పెట్టేసినాది పాడు మనసు" తృప్తిగ అనుకొన్నాడు వీరన్న.

"తాతా... తాతా.... మరేమో... మరేమో" పొంగిపొరలే ఉత్సాహంతో పాప నోట మాట తిన్నగా రాకుండా ఉంది.

"నాకు తెలుసు సిట్టెమ్మా... ఈ ఏల నీ పుట్టినరోజు.... సూడు నీకోసం నేనేటి కొన్నానో" కాగితంలో చుట్టి పదిలంగా బండి సొరుగులో దాచిన పువ్వుల గౌను తీసి చూపించాడు వీరన్న.

పాప వీరన్న మనసుని, మమతని, అతని చేతిలో రెండు నెలలుగా సొమ్ము కూడబెట్టి అతడు కొన్న గౌనుని గుర్తించే స్థితిలో లేదు. ఆ రోజు ఆ పిల్లలో ఆనందం గోదావరి

పొంగులా ఉంది. నాగులేటి వరదలా ఉంది. దానికి తాత మమత అడ్డుకట్ట వెయ్యలేదు. అతడి చేతిలోని పువ్వుల గౌను దాని ప్రవాహ వేగాన్ని మళ్లించలేదు.

వీరన్న పాప వైపు పరిశీలనగా చూసాడు. ఆరోజు ఆ పిల్ల తొడుక్కొన్న బట్టలు, చేసుకొన్న అలంకరణ కొత్తగా ఉంది. ఆ మార్పుకి కారణం ఏమిటో అతడు గ్రహించాడు.

"నాన్నకి నౌకిరి దొరికిందా సిట్టెమ్మా?" అన్నాడు ఉత్సాహంగా.

"ఉహూ" అడ్డంగా తల తిప్పింది పాప.

"మరి?"

"నేనింక ఈ బడిలో చదవను..."

వీరన్నకి అర్థం కాలేదు. బడి మానేయడమే పాపలో ఇంత ఉత్సాహానికి కారణమా?

".... అమ్మా, నేనూ, నాన్నగారు అత్తయ్యగారి ఊరు నుంచి ఇంకో ఊరుకి వెళ్లిపోతున్నాం. మరేమో... మరేమో తాతా నాన్నకి లాటరీలో నాలుగు లక్షల రూపాయలు వచ్చాయి. నాలుగు లక్షలు అంటే ఎన్నో తెలుసా తాతా? ఇన్ని రూపాయలు" తన రెండు చేతులు చాచగలిగినంత ఎడంగా చాచి చూపించింది పాప.

ఎలా వచ్చిందో, పాప అలాగే గాలిలో ఎగిరే పక్షిలా ఉత్సాహంతో పల్టీలు కొడ్తూ ఎగిరిపోయింది. వీరన్న చేతిలో మిగిలిపోయింది వెలవెలపోతున్న పువ్వుల గౌను.

"నాలుగు లక్షలంటే ఎన్ని రూపాయలో తెలుసునా తాతా..." పాప మాటలు వీరన్న చెవుల్లో గింగురుమంటున్నాయి.

"నా సిట్టెమ్మని నాకు దూరం చెయ్యగలిగినన్ని" నెమ్మదిగా బండి నడుపుకుపోతూ అనుకొన్నాడు వీరన్న బాధగా.